వీరభద్రుడి జాతరకు వేళాయె..

- రేపటి నుంచి ఐదు రోజుల పాటు ఉత్సవాలు
- ఆలయ ఏర్పాట్లు పూర్తి
- అధికసంఖ్యలో హాజరుకానున్న భక్తులు

రాయికోడ్(అందోల్): జిల్లాలోని పురాతన శైవ పుణ్యక్షేత్రాల్లో ఒకటైన రాయికోడ్ వీరభద్రేశ్వర స్వామి దేవాలయం జాతరకు ముస్తాబైంది. ఈ నెల 10వ తేదీ నుంచి ఐదు రోజుల పాటు ఉత్సవాలు కొనసాగుతాయి. 500 ఏళ్ల చరిత్ర కలిగిన భద్రకాళీ సమేత వీరభద్రేశ్వరస్వామి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించి ఉత్సవ రథాన్ని సిద్ధం చేశారు.


భద్రకాళీమాత, వీరభద్రేశ్వరస్వామి విగ్రహాలు


ఆలయంలోని గర్భగుడి

ఆలయ చరిత్ర..

భద్రకాళీ సమేత వీరభద్రేశ్వరస్వామి ఆలయం 14, 15వ శతాబ్దాల్లోని కాకతీయ, విజయనగర సామ్రాజ్య కాలానికి చెందినదిగా చరిత్రకారులు చెబుతారు. ఆలయంలోని భద్రకాళీమాత వీరభద్రేశ్వరుల విగ్రహాలను ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ ప్రాంతం నుంచి కర్ణాటక, మహారాష్ట్రాల సరిహద్దు ప్రాంత భక్తులు విగ్రహాలను తరలిస్తూ ఓ రోజు రాత్రి స్థానిక మల్లికార్జున ఆలయంలో సేదతీరారు. తిరిగి బయలుదేరు సమయంలో విగ్రహాలు ఎంతకూ కదలలేదు. రెండోరోజు రాత్రి వీరభద్రుడు గజ్జలసవ్వడితో కలలో వచ్చి ‘ఇదే నాకు సరైన పుణ్యస్థలం నేను ఇక్కడే స్వయం ప్రతిష్టతంగా వెలుగొందుతాను’ అని భక్తులతో పలకగా విగ్రహాలను ప్రతిష్టించగా ఆలయం వెలసిందని చరిత్ర. 108 శక్తిపీఠాల్లో భద్రకాళీ దేవత ఒకరిగా స్కందపురాణం, మత్స్యపురాణాల్లో వివరించినట్లు ఆలయ చరిత్ర ఉంది.

ఇతర రాష్ట్రాల నుంచి...

తెలంగాణలోని భక్తులే కాకుండా కర్ణాటక, మహారాష్ట్రాలకు చెందిన భక్తుల ఇలవేల్పుగా ఆలయాన్ని దర్శించుకుంటారు. భద్రకాళీ, వీరభద్రులు ఏకశిలపై ఎటువంటి ఆధారం లేకుండా ఉండటం విశేషంగా చెప్పవచ్చు. ప్రచండ, ప్రతాప, రుద్ర రౌద్రావతారుడుగా పేరున్న వీరభద్రుడు ఉదయం బాలవీరభద్రుడిగా, మధ్యాహ్నం యువ వీరభద్రుడిగా, సాయంత్రం వృద్ధ వీరభద్రుడిగా భక్తులకు దర్శనమిస్తున్నారు.

ఉత్సవ కార్యక్రమాలు..

- ఏప్రిల్ 10న ధ్వజారోహణం, శిఖరపూజ, భద్రకాళీ కుంకుమార్చన, వీరభద్ర అభిషేకం, బసవేశ్వర అభిషేకం, కార్యక్రమాలు ఉంటాయి.
- 11న మహారుద్రాభిషేకం, పల్లకిసేవ, అగ్నిగుండం, గణపతిహోమం, భద్రకాళీదేవి–వీరభద్రేశ్వరస్వాముల అభిషేకం, కల్యాణం, సాయత్రం రథోత్సవం స్థానిక బసవేశ్వర ఆలయానికి చేరుతుంది. రాత్రి భజన కార్యక్రమాలు నిర్వహిస్తారు. బీచ్కుందకు చెందిన సోమలింగ శివాచార్యులచే తీర్థప్రసదాల వితరణ, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి.
- 12న మల్లికార్జునస్వామి, భద్రకాళీ, సమేత వీరభద్రుడికి సహస్ర బిల్వార్చన, వీరాంజనేయ పూజ, భజన కార్యక్రమాలు ఉంటాయి.
- 13న భద్రకాళీమాత, వీరభద్రేశ్వరులకు అభిషేకం, శతనామావళితో బిల్వార్చన, కుంకుమార్చన, మంగళహారతి కార్యక్రమాలు ఉంటాయి.
- 14న వీరభద్రేశ్వరస్వామి, భద్రకాళీ మాతలకు అభిషేకం, ఆకులపూజ, దంపతుల పూజలను నిర్వహిస్తారు.
- 15న వీరభద్రేశ్వర, భద్రకాళీమాత అభిషేకం, రాత్రికి ఉత్సవ రథం బసవేశ్వర ఆలయం నుంచి బయలుదేరి వీరభద్రేశ్వర ఆలయానికి చేరుకుంటుంది. అనంతరం భజన కార్యక్రమాలు నిర్వహించి ఉదయం వేడుకలను ముగిస్తామని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

13న ఖేడ్‌కు రేవంత్‌రెడ్డి రాక

నారాయణఖేడ్: హాత్‌సేహాత్‌జోడో పాదయాత్రలో భాగంగా ఈ నెల 13న టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి నారాయణఖేడ్ నియోజకవర్గంలో పాదయాత్రలో పాల్గొంటారని టీపీసీసీ ఉపాధ్యక్షులు, మాజీ ఎంపీ సురేశ్ షెట్కార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఖేడ్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాదయాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సీపీఎం శ్రేణుల నిరసన

నారాయణఖేడ్: ప్రధానమంత్రి నరేంద్రమోడీ హైదరాబాద్ రాక సందర్భంగా శనివారం ఖేడ్‌లో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి రాష్ట్రాల హక్కులను తమ చేతుల్లో తీసుకుని విభజన చట్టాల హామీలను విస్మరించారని పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అతిమేల మాణిక్యం ఆరోపించారు. కృష్ణాబోర్డులో రాష్ట్ర నీటివాటాను తేల్చకుండా తెలంగాణకు తీరని అన్యాయం చేస్తున్నారని పేర్కొన్నారు. మోడీ గోబ్యాక్ అంటూ నినదించారు. పార్టీ జిల్లా, స్థానిక నాయకులు చిరంజీవి, నర్సింహులు, గణపతి, ప్రవీణ్, ప్రశాంత్ పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న నాయకులు

క్లుప్తంగా

రోడ్డు విస్తరణ పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని సోలక్‌పల్లి నుంచి రాళ్లకత్వ, శివానగర్ గ్రామాల మీదుగా చిన్నకంజర్ల చౌరస్తా వరకు చేపడుతున్న రోడ్డు విస్తరణ పనులను శనివారం జెడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి చొరవతో అన్ని గ్రామాలు పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందుతున్నాయన్నారు. రోడ్డు పనులను నాణ్యతగా చేపట్టాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రామకృష్ణ, నరేందర్ పాల్గొన్నారు.

ఎస్‌ఎంఆర్ యువసేన సేవలను విస్తరిస్తాం

- బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నీలం మధు ముదిరాజ్


మాట్లాడుతున్న నీలం మధు

పటాన్‌చెరు టౌన్: ఎస్‌ఎంఆర్ యువసేన సేవలను మరింత విస్తరిస్తామని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ తెలిపారు. పటాన్‌చెరు పట్టణం చైతన్యనగర్ కాలనీకి చెందిన పలువురు యువకులు శుక్రవారం రాత్రి ఎస్‌ఎంఆర్ యువసేనలో చేరారు. అనంతరం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ ప్రజలకు సేవ చేసేందుకు తరతమ బేధాలు చూడకుండా ఎస్‌ఎంఆర్ యువసేన సభ్యులు ముందుంటారని చెప్పారు. ఇప్పటికే ఎంతోమంది ఎస్ఎంఆర్ యువసేనకు పార్టీలకతీతంగా అభిమానులుగా మారారని తెలిపారు. ప్రజలకు చేరువయ్యేందుకు అనేక సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మెట్టు కృష్ణయాదవ్, నాయికోటి యాదయ్య, డప్పు యాదయ్య, సాయిరాజ్, ఆసిఫ్, మధు, యాదయ్య, సందీప్, రమేష్, సాయిబాబు ముదిరాజ్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

పేపర్ లీకేజీపై విచారణ జరిపించాలి


దీక్ష చేస్తున్న వైఎస్సార్ టీపీ నాయకులు

నారాయణఖేడ్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జీ చేత విచారణ జరిపించాలని వైఎస్సార్ తెలంగాణ పార్టీ జిల్లా అధ్యక్షులు బాపు మల్‌శెట్టి డిమాండ్ చేశారు. వైఎస్సార్ టీపీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పిలుపుమేరకు ‘నిరుద్యోగుల కోసం కొట్లాట’లో భాగంగా శనివారం నారాయణఖేడ్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా బాపు మల్‌శెట్టి మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ పేపర్‌ల లీకేజీకి పాల్పడిన నిందితులపై కఠినచర్యలు తీసుకుని బాధిత నిరుద్యోగులకు రూ.లక్ష చొప్పున పరిహారం చెల్లించాలన్నారు. ఖాళీగా ఉన్న 1.91లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. దీక్షలో పార్టీ జిల్లా, స్థానిక నాయకులు గోవింద్‌యాదవ్, ఆశీర్వాద్, శిరోమణి, మాణయ్య, దుర్గయ్య, శంకర్, రామప్ప, బేతప్ప, రామన్న, అర్జున్, మహేష్, షబ్బీర్ అలీ, సర్దార్‌నాయక్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

మునిపల్లి(అందోల్): మండల పరిధిలోని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీపీ శైలజశివశంకర్, జెడ్పీటీసీ మీనాక్షిసాయికుమార్ తెలిపారు. శనివారం మండలంలోని కంకోల్‌లో సీసీ రోడ్డు పనులను సర్పంచ్ విశ్వనాథంతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం ద్వారా మంజూరైన రూ.25 లక్షలతో సీసీ రోడ్డు పనులను చేపడుతున్నట్లు తెలిపారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని వెంకటాపూర్‌లో రూ.9లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను శనివారం ఎంపీటీసీ ఒగ్గు శ్రీనివాస్ ప్రారంభించారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యులు ఖలీల్, ఉపసర్పంచ్ శంకర్, వార్డుసభ్యులు నరేందర్, నవీన్ కుమార్, ప్రేమానందం, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నరేష్‌గౌడ్, చిలువరి వెంకటేశం, పోచన్న, లక్ష్మణ్, హరికాంత్, నర్సింలు, యాదగిరి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు సంకష్టహార చతుర్థి

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని రేజింతల్ శివారులో స్వయంభూగా వెలసిన సిద్ధివినాయక ఆలయంలో ఆదివారం సంకష్టహార చతుర్థి కార్యక్రమం నిర్వహించనున్నారు. స్వామివారిని దర్శించుకునేందుకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా కర్నాటక, మహారాష్ట్రాలకు చెందిన భక్తులు వేలసంఖ్యలో ఆలయానికి తరలివచ్చి దైవదర్శనం చేసుకుంటారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ ట్రస్టు సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

బలహీనవర్గాల సంక్షేమానికి కృషి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: బడుగు, బలహీనవర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి తెలిపారు. కంగ్టి మండలం ఎడ్లరేగడి తండాలో నూతనంగా నిర్మిస్తున్న జ్వాలాముఖి అమ్మవారి ఆలయ ప్రహరీ నిర్మాణానికి రూ.20లక్షల మంజూరు పత్రాలను నారాయణఖేడ్ క్యాంపు కార్యాలయంలో ఆలయ నిర్వాహకులకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఆలయ పీఠాధిపతి మాణిక్‌చంద్ మహారాజ్, కంగ్టి జెడ్పీటీసీ కోట లలితాఆంజనేయులు, ఎంపీటీసీ శ్రీకాంత్, సర్పంచ్ బల్‌రాం, మాజీ సర్పంచ్ నారాయణలు పాల్గొన్నారు. అనంతరం ఖేడ్ నియోజకవర్గంలోని 47మంది జర్నలిస్టులకు రెండో విడత ఇళ్ల స్థలాల పట్టాలను అందజేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనా నజీబ్, జెడ్పీటీసీ లక్ష్మిబాయి రవీందర్‌నాయక్, ఖేడ్, కంగ్టి మండలాల పార్టీ అధ్యక్షులు పరమేష్, గంగారాం, ముఖ్య నాయకులు రమేష్ చౌహాన్, అభిషేక్ షెట్కార్ పాల్గొన్నారు. అదేవిధంగా పెద్దశంకరంపేట మండలం బుజరాన్‌పల్లికి చెందిన సాయిలుకు రూ.25వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు. సిర్గాపూర్ మండలం ఉజలంపాడ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన మత్స్య సహకార సంఘం సభ్యులు క్యాంపు కార్యాలయంలో కలిసి ఎమ్మెల్యేను సన్మానించారు.

సిద్ధివినాయకుడి సన్నిధిలో కేంద్రమంత్రి


మంత్రి కుటుంబసభ్యులను సన్మానిస్తున్న అర్చకులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని రేజింతల్ శివారులోని సిద్ధివినాయకుడిని శనివారం కేంద్ర ఎరువులు, రసాయనాల పునరుత్పాదక సహాయశాఖమంత్రి భగవత్ కుబ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి కుటుంబసభ్యులకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు.

క్రికెట్ పిచ్ ఏర్పాటుకు చర్యలు

నారాయణఖేడ్: పట్టణంలోని అప్పారావు షెట్కార్ క్రీడామైదానంలో క్రికెట్ ఆడేందుకు పిచ్‌ను ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ 2వ వార్డు కౌన్సిలర్ స్వప్నఅభిషేక్ షెట్కార్ తెలిపారు. ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనానజీబ్ సూచన మేరకు క్రీడాకారులతో కలిసి శనివారం స్టేడియాన్ని సందర్శించినట్లు కౌన్సిలర్ చెప్పారు.

ఘనంగా ఎల్లమ్మ జాతర

జహీరాబాద్ టౌన్: మండల కేంద్రమైన మొగుడంపల్లిలో రేణుకఎల్లమ్మ జాతర శనివారం ప్రారంభమైంది. ఉత్సవాల్లో భాగంగా శనివారం బోనాల ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి పూజలు నిర్వహించారు. సాయంత్రం బండ్ల ఊరేగింపు నిర్వహించారు. జాతరకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

అంబేడ్కర్ యువజన సంఘానికి చెక్కు అందజేత

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండలంలోని జాడిమల్కాపూర్ గ్రామ అంబేద్కర్ యువజన సంఘానికి జెడ్పీటీసీ, బీఆర్‌ఎస్ నాయకులు విజయమోహన్‌రెడ్డి రూ.25వేల చెక్కును ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ నెల 14న అంబేద్కర్ జయంతి ఘనంగా నిర్వహించనున్నట్లు సంఘం నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఆత్మకమిటీ డైరక్టర్ పరుశరాం, ఉపసర్పంచ్ జ్యోతిరాజ్, యువజన సంఘం నాయకులు రాజు, ప్రశాంత్, రాచప్ప, బస్వరాజ్, బక్కప్ప, బిచ్చప్ప, పులేందర్, బాలరాజ్ పాల్గొన్నారు.


చెక్కు అందజేస్తున్న విజయమోహన్‌రెడ్డి

ఘనంగా రన్ ఫర్ జీసస్

పటాన్‌చెరు: ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు.గుడ్‌ఫ్రైడే పురస్కరించుకొని పట్టణంలోని మైత్రి మైదానంలో ఏర్పాటు చేసిన రన్ ఫర్ జీసస్ ద్విచక్ర వాహనాల ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో నూతన చర్చిల నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు. సమావేశంలో పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్‌రెడ్డి, క్రిస్టియన్ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.


పటాన్‌చెరు: ర్యాలీలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

జహీరాబాద్‌లో..

జహీరాబాద్: పట్టణంలో క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో లైవ్ ఫర్ జీసెస్ పీస్ ర్యాలీ నిర్వహించారు. అల్లీపూర్‌లోని మెథడిస్ట్ సెంట్రల్ చర్చి నుంచి జహీరాబాద్ పట్టణం గుండా భవానీమందిర్ క్రాస్‌రోడ్డు వరకు చేరుకుంది. ర్యాలీని ఎమ్మెల్యే మాణిక్‌రావు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. డీఎస్ రెవరెండ్ జాన్‌వెస్లీ, పాస్టర్ ఇజ్రాయిల్‌లు క్రీస్తుజీవితంపై దైవ సందేశం వినిపించారు.

నారాయణఖేడ్‌లో..

నారాయణఖేడ్: ఖేడ్‌లో యునైటెడ్ క్రిస్టియన్ ఫోరం ఆధ్వర్యంలో శనివారం క్రైస్తవులు జీసెస్ ఫర్ రన్ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయ సమీపంలోని ఏసుక్రీస్తు శిలువకు ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి పూలమాల వేసి జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. అనంతరం క్రిస్టియన్ మిషనరీ పెద్దలు ఎమ్మెల్యేను సన్మానించారు. మెథడిస్ట్ చర్చి జిల్లా సూపరింటిండెంట్ సలోమన్‌రాజ్, జిల్లా లేలీడర్ జయరాజ్, వివిధ చర్చిల బాధ్యులు జీవరత్నం, సాలోమన్, భూమయ్య, దేవదానం, జాషువా, నాథన్‌డ్యానీ పాల్గొన్నారు.

వట్‌పల్లిలో..

వట్‌పల్లి(అందోల్): మండల కేంద్రమైన వట్‌పల్లిలో శనివారం గుడ్‌ఫ్రైడేను పరస్కరించుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం క్రైస్తవ సంఘం పాస్టర్లు, క్రైస్తవులు ప్రేయర్ టవర్ చర్చి నుంచి వట్‌పల్లిలో అంబేద్కర్ చౌరస్తా మీదుగా మార్కెట్ యార్డు వరకు రన్‌ఫర్ జీసస్ ర్యాలీని నిర్వహించారు.

రాయికోడ్‌లో..

రాయికోడ్ (అందోల్): మండల కేంద్రంలో గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ పర్వదినాలను పురస్కరించుకుని రన్ ఫర్ జీసస్ బైక్ ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ర్యాలీలో వివిధ గ్రామాల క్రైస్తవులు, పాస్టర్లు హాజరయ్యారు.



జహీరాబాద్: ర్యాలీలో ఎమ్మెల్యే మాణిక్‌రావు


నారాయణఖేడ్: జెండా ఊపి రన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నిరుద్యోగులకు అండగా వైఎస్సార్ టీపీ

కొండాపూర్(సంగారెడ్డి): నిరుద్యోగులకు అండగా వైఎస్సార్ టీపీ అండగా ఉంటుందని ఆ పార్టీ అసెంబ్లీ కోఆర్డినేటర్ సాయినాథ్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్ టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల ఆదేశాల మేరకు టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా శనివారం కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయినాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో సీఎం కేసీఆర్ పూర్తిగా విఫలమయ్యారన్నారు. ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగభృతి కల్పిస్తామని నిరుద్యోగులను మోసం చేశారన్నారు. వైయస్ఆర్ తెలంగాణ పార్టీ నిరుద్యోగుల పక్షాన పోరాటం చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా యువజన విభాగం కోఆర్డినేటర్ ఆనంద్‌గౌడ్, జిల్లా యువజన విభాగం కార్యదర్శి రంగల్ల రమేష్, ఎల్లయ్య, మైపాల్, ప్రవీణ్, శివ, మోహన్, దేవదాస్, రాజు, శ్రీకాంత్, నరేష్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట రిలే నిరహారదీక్షలు చేస్తున్న వైఎస్సార్‌టీపీ నాయకులు

ఘనంగా సీత వైద్యం కిషోర్ జన్మదినం

పటాన్‌చెరు టౌన్: ప్రజలకు, పద్మశాలి సంఘానికి సేవ చేయడంతో తృప్తి, ఆనందం ఉందని పటాన్‌చెరు పద్మశాలి సంఘం అధ్యక్షుడు, జిల్లా ఉపాధ్యక్షుడు సీతవైద్యం కిషోర్ అన్నారు. శనివారం ఆయన జన్మదినాన్ని పురస్కరించుకొని పట్టణంలో ఆ సంఘం సభ్యులు, నాయకులు కేక్‌లు కట్ చేయించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు జ్ఞానేశ్వర్, మల్లేశం, లక్ష్మణ్, నారాయణ, నరేష్, ప్రవీణ్, మురళీ, రాజు పాల్గొన్నారు.


రోగులకు పండ్లను పంపిణీ చేస్తున్న సీతవైద్యం కిషోర్

వెంకటాచల దివ్యక్షేత్రంలో పూజలు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని వెంకటాపూర్ శివారులోని వెంకటచల దివ్యక్షేత్రంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చిల్వేరి వెంకటేశం, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

పటాన్‌చెరు: ఇఫ్తార్‌విందులు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. శనివారం పటాన్‌చెరు పట్టణంలోని జేపీ కాలనీలో ముస్లింలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, మాజీ ఎంపీపీ యాదగిరియాదవ్, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షులు అఫ్జల్, మాజీ కార్పొరేటర్ సపానదేవ్, ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.


ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే

ప్రధానమంత్రి సభకు తరలిన బీజేపీ శ్రేణులు


ఝరాసంగం(జహీరాబాద్): సమావేశానికి తరలి వెళ్తున్న నాయకులు

ఝరాసంగం(జహీరాబాద్): హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రధానమంత్రి మోడీ సభకు మండలం నుంచి బీజేపీ శ్రేణులు తరలివెళ్లారు. శనివారం మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలకు చెందిన నాయకులు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు అడివన్న, యువమోర్చా మండల అధ్యక్షుడు విశ్వనాథ్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు యాదవ్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

జిన్నారం నుంచి..

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం, గుమ్మడిదల మండలాల నుంచి పీఎం మోడీ సభకు బీజేపీ నాయకులు శనివారం భారీగా తరలివెళ్లారు. జిన్నారం మండల అధ్యక్షులు శ్రీకాంత్‌గౌడ్, నాయకులు ప్రతాప్ రెడ్డి, రాజిరెడ్డి, గుమ్మడిదల మాజీ అధ్యక్షులు రాజిరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు సభకు తరలివెళ్లారు.

నారాయణఖేడ్ నుంచి..

నారాయణఖేడ్: హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో శనివారం నిర్వహించిన ప్రధానమంత్రి నరేంద్రమోడీ సభలో పాల్గొనేందుకు ఖేడ్ నియోజకవర్గం నుంచి బీజేపీ శ్రేణులు అధికసంఖ్యలో తరలివెళ్లారు. సభకు వెళ్లిన వారిలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రజినీకాంత్, ముఖ్య నాయకులు సాయిరాం, సంజీవ్‌పటేల్, రాజశేఖర్‌గౌడ్, సుధాకర్, సతీష్ కుమార్, నాగనాథ్, వెంకట్‌రెడ్డి, మురళీ, దశరథ్, సాయిసాగర్, అశోక్, సచిన్, శివకుమార్ ఉన్నారు.

సదాశివపేట మండలం నుంచి...

సదాశివపేట(సంగారెడ్డి): ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బహిరంగసభకు పట్టణ మండల పరిధిలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో నాయకులు శివరాజ్‌పాటిల్, కోపూరి సంగమేశ్వర్, సత్యనారాయణ, సారకృష్ణ, మాణిక్‌రావు, శ్రీనివాస్, అంబదాస్ పాల్గొన్నారు.

జహీరాబాద్ నియోజకవర్గం నుంచి..

జహీరాబాద్: సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన ప్రధానమంత్రి సభకు జహీరాబాద్ నియోజకవర్గం నుంచి బీజేపీ శ్రేణులు భారీసంఖ్యలో తరలివెళ్లారు. జహీరాబాద్, కోహీర్, ఝరాసంగం, న్యాల్‌కల్, మొగుడంపల్లి మండలాల పార్టీ బాధ్యులు గ్రామాల నుంచి కార్యకర్తలను సభకు తరలించారు.

సంక్షిప్త వార్తలు

10న విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

జిన్నారం(పటాన్‌చెరు): విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ పరమైన సమస్యలు పరిష్కరించేందుకు ఈ నెల 10న గుమ్మడిదల విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఏఈలు రవీందర్, రాజు, ఏడీఈ శ్రీకాంత్‌లు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు వారి ఆధార్‌కార్డు, విద్యుత్ బిల్లులను తీసుకురావాలని సూచించారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు అందజేత

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని దోమడుగు గ్రామ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు సర్పంచ్ రాజశేఖర్ తన సొంత నిధులతో శనివారం దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

మహనీయుల జయంతిని విజయవంతం చేయాలి

నారాయణఖేడ్: మహనీయుల జయంతిని విజయవంతం చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాణిక్యం అన్నారు. కేవీపీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన పూలే, అంబేద్కర్ సందేశ్ బైక్‌యాత్ర శనివారం నారాయణఖేడ్, నాగల్‌గిద్ద, మనూరు మండలాల్లో కొనసాగింది. ఆయా మండలాల్లోని గ్రామాల మీదుగా యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో కేవీపీఎస్, సీఐటీయూ నాయకులు నర్సింహులు, చిరంజీవి, గణపతి, కంటెప్ప, ప్రవీణ్, శంకర్, శ్రీకాంత్, మశ్చేందర్, శివానంద్, గౌతమ్, రాములు పాల్గొన్నారు.

ఎస్‌ఎంఆర్ యువసేన ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరనగర్‌కాలనీలో ఎస్‌ఎంఆర్ యువసేన ఆధ్వర్యంలో శనివారం క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాజీ ఉపసర్పంచ్ కృష్ణ, న్యాయవాది రాజిరెడ్డి, నీటి సంఘం మాజీ అధ్యక్షులు వడ్డే నరసింహులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్‌ఎంఆర్ యువసేన ఆధ్వర్యంలో క్రీడాపోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. యువసేన నాయకులు తల్లారి మధు మాట్లాడుతూ క్రికెట్ పోటీలు ఈ నెల 14న తేదీ వరకు కొనసాగుతాయని, ఇందులో 34టీంలు పాల్గొంటాయన్నారు.

ఆర్థికసాయం అందజేత

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని బాలాజీనగర్‌కు చెందిన ప్రసాద్ ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని స్థానిక కౌన్సిలర్ సుజాత బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు, చిట్కుల్ సర్పంచ్ నీలం మధు దృష్టికి తీసుకెళ్లగా నీలం మధు రూ.15వేల ఆర్థికసాయాన్ని ప్రకటించారు. ఇందుకు సంబంధించిన నగదును కౌన్సిలర్ సుజాత శనివారం మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వాతి నక్షత్రం సందర్భంగా స్వామివారికి మహా పంచామృత అభిషేకం,సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, సుదర్శన నరసింహస్వామి హోమం, తామరపుష్పాలతో అర్చన, లక్ష్మీనరసింహస్వామి కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించారు.

సీతారామస్వామి ఆలయంలో అన్నదానం

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని కోదండ సీతారామస్వామి దేవాలయంలో శనివారం కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రతి శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు అఫ్జల్, జలగరి ఎట్టయ్య, మహిళా పట్టణ అధ్యక్షురాలు మాధవి, జయశ్రీ, యాదయ్య, బాలు పాల్గొన్నారు.